భారతీయ జీవిత బీమా సంస్థ విశ్రాంత వికాసాధికారి శ్రీ పరిగొండ కాంతారావు

# రచనోద్యోగము



షష్టిపూర్తి ఉపాయనంగా రామాయంపేట & వరంగల్లు ఏజెంటు మిత్రులు

# ఉద్యోగ జీవితం

నా తొలి అధికారిక ఉద్యోగము 22.5.1972నాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆబ్కారి శాఖకు చెందిన వరంగల్లు ఎక్సైజు సూపరింటిండెంటు కార్యాలయములో స్టెనోగ్రాఫరుగా మొదలైనది. ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు టైపు రైటర్లను ప్రవేశపెట్టే పథకంలో భాగంగా శాశ్వతోద్యోగంలో ఉండిన టైపిస్టులకు, మూడు నెలలపాటు తెలుగు టైపు రైటింగు శిక్షణనిచ్చేవారు. అటువంటి సందర్భంలో మార్కండేయులు గారనే టైపిస్టు శిక్షణ నిమిత్తము వెళ్ళగా నాకా కార్యాలయంలో మూడునెలల పాటు పనిచేసే భాగ్యం కలిగింది. ఉద్యోగము టైపిస్టుదే అయినా స్టెనోగ్రాఫరు కావాలని ఎక్సైజు సూపరింటిండెంటు కోరిన దరిమిలా ప్రాంతీయ ఎంప్లాయ్‌మెంటు ఎక్స్చేంజివారు షార్టు హ్యాండు పరీక్ష పాసయిన ఎనమండుగురు అభ్యర్థులను పంపినారు. ఎక్సైజు కార్యాలయం వారు డిక్టేషను పరీక్షను నిర్వహించి, నన్ను ఎంపిక చేసికొన్నారు.

తొలి అధికారిక ఉద్యోగమన్న ప్రస్తావన ఎందుకంటే, అంతకు ముందు కొంతకాలము వరంగల్లు అవినీతి నిరోధక శాఖకు సంబంధించిన డి.యస్.పి. కార్యాలయంలో జీతభత్యములు లేకుండా పనిచేసి ఉన్నాను. అప్పటి డి.యస్.పి. శ్రీ బిరుదురాజు జగన్నాథరాజు గారు మా నాయనగారికి మిత్రులు. 'మా అబ్బాయి ఖాళీగా ఉంటే పాడైపోతాడు. వాడు టైపురైటింగ్ మరచిపోకుండా ఉండేందుకూ ఆఫీసు పనులు నేర్చుకొందుకూ మీ వద్దకు పంపేదా !' అని మా నాయనగారు అడిగిన దరిమిలా వారు అంగీకరించారు. పర్మినెంటు టైపిస్టు మల్లయ్య గారి మార్గదర్శనంలో పెండింగులో ఉన్న కాయితాలేవో టైపు చేసిపెట్టేవాడిని. ఎక్కువ శాతం అక్కడా ఖాళీగానే ఉండేవాడిని. అయినా ప్రభుత్వ కార్యాలయాల తీరుతెన్నులనర్థం చేసికోవడానికి ఆ అనుభవం పనికి వచ్చింది.

అంతకన్నాముందు డోర్నకల్లు జిల్లా పరిషత్తు హైస్కూల్లో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న మా మేనమామ శ్రీ వెల్లంకి వెంకట సత్యనారాయణ రావు గారి సౌజన్యంతో అక్కడి రైల్వేకు సంబంధించిన పర్మినెంటు వే ఇన్స్పెక్టరు కార్యాలయంలో మూడు నాలుగు నెలలపాటు కళాసీగా పనిచేశాను. నెలకు యాభైయ్యేడు రూపాయల జీతం. 'అబ్బాయికి రాత పనులు మాత్రమే ఇస్తామ'న్న హామీ మీద మా మామయ్య – నన్నక్కడ చేర్చారు. కాని వారు మాట మీద నిలబడలేదు. నేను మా మామయ్యకా విషయాన్ని గురించి ఫిర్యాదు చేయలేదు.

నన్ను వడ్రంగి మేస్త్రి చేతికింద పెట్టారు. మేస్త్రీ చాలా మంచివాడు. అతని పేరు బాబరు అని గుర్తున్నది, పేరుకేమి గాని నా కనులలో ముద్రింపబడిన అతని రూపమూ, నా చెవులల్లో ప్రతిధ్వనిస్తున్న అతని గొంతుకా ఇప్పటికీ తాజాగా ఉన్నవి. కమ్మరి మేస్త్రి రామకృష్ణ అని ఉండేవాడు. ఏ పనికైనా ఈ ఇద్దరి మేస్త్రీల జట్లను జతచేసి పంపేవారు.

నా జీవితంలోకి ప్రవేశించిన తొలి అధికారి ఎక్సైజు సూపరింటిండెంటు శ్రీ పి. బాలముకుందరావు ఎం.ఎ., ఎల్‌ఎల్.బి.. వారు అత్యంత ప్రతిభాశాలి మాత్రమే కాదు ప్రభావశీలమైన వ్యక్తిత్వము కలిగినవారు. అధికారాన్ని బాధ్యతాయుతమైన కర్తవ్యంగా మలచుకొని వినియోగించుకొనడమెలాగో ఆయనకు తెలిసినట్లుగా

మరొకరికి తెలియదేమో! నిర్దుష్టమైన ఆలోచనా విధానం, సత్వరమైన నిర్ణయాలు ఆయన ప్రత్యేకత. తన నిర్ణయాలు అమలుపరుపబడినవో లేదో తెలుసుకొందుకుగాను ఆయన కంటూ కొన్ని విధానాలుండేవి. ఎవరినీ అడగకుండానే తెలుసుకోవడం ఆయనలోని ప్రత్యేకత. ఖరీదైన స్టేషనరీ, బాగా రాసే పెన్నూ – ఈ వ్యసనం నన్ను కూడా అంటుకొంది. ఆయన అందరికీ అందుబాటులో ఉన్నా, ఎందుకొచ్చావని ఎవర్నీ అడక్కపోయినా, ఆయన్ను కలవాలంటే అందరికీ భయంగానే ఉండేది.

తీరికలేని జిల్లా స్థాయి అధికారి అయినా ఆయన చేతిలో ఎప్పుడూ ఏదో ఒక పుస్తకముండేది. ఎక్కువగా ఇంగ్లీషు పుస్తకాలుండేవి. రెండు మూడ్రోజులకొక సారి ఆ పుస్తకం మారిపోతుండేది. అంటే ఆ సమయంలో ఆ పుస్తక పఠనం పూర్తియ్యేదన్నమాట.

"చూడు కాంతారావు ! నువ్వు ఎక్కడ పనిచేసినా, ఏ స్థాయిలో పనిచేసినా – నువ్వు పనిచేసే ఆఫీసు లేకపోతే సమాజానికేమైనా నష్టమా ! ఈ కార్యాలయాన్నేర్పాటు చేయడంలో ప్రభుత్వం ఉద్దేశ్యమేమిటి. ఈ కార్యాలయం ఏమేం పనులను చేయవలసి ఉన్నది అన్న విషయాల్ని సంపూర్ణంగా అర్థం చేసికోవాలి. ఒక సెలవు రోజున నేను నీకు ఆఫీసు తాళాలిచ్చి ఇదిగో ఈ పనిచేసుకునిరా అంటే ఆ పనికి సంబంధించిన అన్ని సీట్లల్లోని పనిని పూర్తిచేసుకొని ఫైళ్ళను నా సంతకానికి తీసుకొనిరావాలి. అంటే తరువాత ఆ కాగితం డిస్పాచ్ అయిపోవాలన్న మాట. ఈ పద్ధతిలో పనిని నేర్చుకొన్నాక, నీకిష్టమైతే పనిచేయి లేకపోతే మానేయి. పని తెలిసినవాడు చెయ్యను అంటే అవతలివాడు ఆలోచించాల్సివస్తుంది. పని రాని వాడు పనికిమాలినవాడు ఒక్కటే". ఇదీ ఆయన నాకు చేసిన హితబోధ. ఈ బోధ నా జీవనగతిని మార్చివేసింది.

మూణ్ణెళ్ళ ఉద్యోగం అయిపోయింది. ఒకరోజు అసిస్టెంటు ఎక్సైజు సూపరింటెండెంటు శ్రీ యస్. హరివదన్ లాల్ నన్ను పిలిచి – 'కోర్టులో స్టెనోగ్రాఫర్ ఉద్యోగాలున్నాయట. ఎంప్లాయ్‌మెంటు ఎక్స్చేంజ్‌కి వెళ్ళి డిస్ట్రిక్ట్ ఎంప్లాయ్‌మెంటు ఆఫీసరు వెన్నమనేని వీర రాఘవరావు గారని ఉంటారు వారిని కలువు. కాల్‌లెటర్ ఇస్తారు' అన్నారు. నేను వారిని కలిశాను. కాల్ లెటరు తీసుకొని కోర్టుకు వెళ్ళాను. ఐదుగురం పరీక్ష రాశాం. ఉన్నవి రెండు ఉద్యోగాలు. మొదటి ఉద్యోగం యేలేశ్వరపు హేమచందర్‌కి వచ్చింది. రెండోది నాకు వచ్చింది. మరికొన్నాళ్ళకు మూడవ ఉద్యోగం మా ఐదుగురిలో ఒకడైన పరవస్తు వెంకటప్పయ్యకు వచ్చింది.

నేను ఫస్ట్ అడిషనల్ మున్సిఫ్ మెజిస్ట్రేటు కోర్టులో స్టెనోగ్రాఫరుగా నియమింపపబడ్డాను. 13 అక్టోబరు 1972న ఉద్యోగంలో చేరాను. హేమచందర్ కూడా అదే రోజున ప్రిన్సిపల్ మున్సిఫ్ కోర్టులో చేరాడు.

శ్రీ మహ్మద్ మజహరుల్లా ఖాన్ మున్సిఫ్ మెజిస్ట్రేటుగా ఉండేవారు. తదుపరి కొంతకాలానికి వారు బదిలీపై వెళ్ళగా శ్రీ టి. రంగారావు గారు వచ్చారు. వారి వద్ద పనిచేస్తుండగా ఎల్.ఐ.సి.లో టైపిస్టుగా సెలెక్షన్ వచ్చింది. జనవరి 1 లోగా ఉద్యోగంలో చేరితే ఇంక్రిమెంటు కలిసొస్తుందని ఎల్.ఐ.సి. వారు చెప్పారు. డిసెంబరు కోటా జడ్జిమెంట్లు పూర్తయితేగాని రాజీనామా ఒప్పుకోనని రంగారావు గారన్నారు. ఎల్.ఐ.సి.లో చేరినా ప్రొద్దుటా సాయంత్రం వచ్చి డిక్టేషను తీసుకొని టైపు చేసి పెడతానని చెప్పాను

రంగారావుగారు అందుకు ఒప్పుకొన్నారు. 26 డిసెంబరు 1973 ఉదయం 10.30 గంటలకు నా రాజీనామా పత్రాన్ని మున్సిఫ్ కోర్టులో సమర్పించాను. సాయంత్రం అయిదుగంటలకు జిల్లా జడ్జి ఆమోదాన్ని పొందినట్లుగానూ, నేను ఉద్యోగం నుండి తొలగిపోవచ్చుననీ మున్సిఫ్ మెజిస్ట్రేటు నాకు లేఖను ఇచ్చారు. ఒక్కరోజులో ఒక ఫైలు ఇలా ఆమోదాన్ని పొందడం వరంగల్లు జిల్లా కోర్టులో అదే ప్రథమమని చెప్పారు సహోద్యోగులు. 27.12.1973న ఎల్.ఐ.సి. హనుమకొండ బ్రాంచిలో టైపిస్టుగా చేరాను. ఇచ్చిన మాట ప్రకారం – డిక్టేషన్లు తీసుకొని సుమారు పదిహేను జడ్జిమెంట్లు టైపు చేసి ఇచ్చాను. రంగారావు గారు చాలా సంతోషించారు. నూతనాంగ్ల సంవత్సరాదిన వారికి వచ్చిన కేకుల్లో సగభాగం నాకిచ్చారు.

కాగా రాజీనామా పత్రాన్ని ఆమోదించటానికి ముందు జిల్లా జడ్జి శ్రీ మహేశ్ నారాయణ్ నన్ను పిలిపించుకొని అడిగారు. 'కావాలని ఈ ఉద్యోగానికి వచ్చావు కదా ! వెళ్ళిపోతున్నావేమిటి?' అని 'ఇక్కడ నెలకు రూ. 213/– వస్తున్నది అక్కడ రూ. 384/– వస్తుంది అందుకని వెళ్ళిపోతున్నాను' అని చెప్పాను. 'సరేలే !' అంటూ అంగీకరించారు కాని నాలో ఏదో అసంతృప్తి. ఆరాతీస్తే తెలిసింది. హరివదన్‌లాల్ గారు నాకు తెలియకుండానే 'నేను బాగా పనిచేస్తానని, నన్ను సెలెక్టు చేసికొమ్మని' మహేశ్ నారాయణ్ గారికి చెప్పార్ట.

ఎక్సైజులో ఉద్యోగకాలం ముగిసిపోకముందే డెప్యూటీ కమీషనర్ ఆఫ్ ఎక్సైజు, వరంగల్లు కార్యాలయంలో పర్మినెంటు స్టెనోగ్రాఫరు ఉద్యోగానికి ఖాళీ ఏర్పడింది. శ్రీ పి. బాలముకుందరావు గారు నన్ను పంపించారు. అంతకుముందు ఎంప్లాయ్‌మెంటు ఎక్స్చేంజి నుండి ఎంతమంది వచ్చి పరీక్ష రాశారో తెలియదు. నాకు మాత్రం విడిగా పరీక్ష పెట్టారు. బాలముకుందరావు గారు చెప్పిన కారణంగా నాకు ఉద్యోగం ఖాయమని సహోద్యోగులందరూ చెప్పారు. మూడవరోజున ఫలితాలు చెప్పారు. సలీం అనే వ్యక్తికి ఉద్యోగం ఇచ్చారు. సమయానికి బాలముకుందరావు గారు ఊళ్ళో లేరు. ఓ వారానికి వచ్చారు. రావడం రావడమే "ఏమోయ్! ఎప్పుడు చేరమన్నారు. ఉద్యోగంలో!" అంటూ అడిగారు. నేను ఉద్యోగం రాలేదన్న విషయాన్ని నిరాశతో చెప్పాను. తన మాట పై ఆఫీసు వారు కాదన్నందుకు ఆయనకు కోపం వచ్చింది. అరక్షణంలో కోపాన్ని ప్రసన్నతగా మార్చుకొని' 'సరేలే ! కనుక్కుందాముండు!' అంటూ ఫోన్ చేసి డెప్యూటి కమీషనరుతో మాట్లాడారు.

ఆ వెంటనే చెప్పారు. "సలీం గ్రాడ్యుయేట్. నీవు అండర్ గ్రాడ్యుయేట్‌వి. సలీం టైపురైటింగు అండ్ షార్ట్ హ్యాండుల్లో హయ్యర్ గ్రేడు పాసయ్యాడు. నువ్వు లోయర్‌గ్రేడు మాత్రమే పాసయ్యావు. సహజంగానే అతని స్పీడ్ ఎక్కువగా ఉంటుంది. అందుకే సెలెక్టయ్యాడు."

నా మొహంలోని నిరాశ అలాగే ఉండిందనుకుంటాను. మళ్ళీ ఆయనే అన్నారు. "చూడు కాంతారావ్! ఇక్కడే కాదు ఎక్కడైనా ఎప్పుడైనా మనం పోటీ పడినచోట మనకన్న ఎక్కువ అర్హతలు, యోగ్యతలు ఉన్న వ్యక్తి ఎన్నికైతే – మనం సంతోషపడాలి. మనకు రాలేదే అని బాధపడకూడదు. కారణం అక్కడ మెరిట్ గౌరవింపబడుతోంది గనుక" అని చెప్పారు. ఆ తదుపరి నేను అనేక పరీక్షల్లో అనుత్తీర్ణుడనైనాను. కాని ఏనాడూ బాధపడలేదు. కారణం శ్రీ పి. బాలముకుందరావు గారు.

# వికాసాధికారిగా వరిగొండ వారి ప్రస్థానం

శ్రీ వరిగొండ కాంతారావు గారు జీవిత బీమా సంస్థలో మెదకు శాఖా కార్యాలయములో, రామాయంపేట కేంద్రముగా, వికాసాధికారిగా పనిచేసిన రోజుల్ని ఒకసారి గుర్తు చేసుకొంటూ గతంలోకి వెళితే... !

నాకు సన్నిహితులు, మిత్రులు కీ॥శే॥ లింగోజి గారి సంజీవరావు దేశపాండే గారు వారి వద్ద ఏజెంటుగా బహుశా 1985-86లో అనుకుంటాను, పని చేయుచున్నరోజులవి. ఆ రోజుల్లో నేను శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో మా స్వగ్రామము నార్సింగిలో, ప్రధానాచార్యులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నాను. అప్పుడే శ్రీ కాంతారావు గారి పరిచయము జరిగినది.

నాకు తెలిసినంతవరకు వారు జీవిత బీమా వికాసాధికారిగా 1982లో, మెదకు శాఖాకార్యాలయములో, రామాయంపేట కేంద్రముగా నియమింపబడినారని తలుస్తాను. వారి వద్ద ఏజెన్సీ తీసుకొన్ననాటి నుండి సుమారు 9 సంవత్సరాలు 1996 వరకు వారితోనూ, సహచర ఏజెంట్లతోనూ కలిసి పనిచేసిన రోజులను ఒకసారి అవలోకనం చేసుకొంటే, అమితానందము కలుగుతుంది.

వికాసాధికారిగా వారి ప్రస్థానంలోని చాలా సంఘటనలు పునరావలోకనం చేసుకొనే సందర్భం రావటం నిజంగా హర్షించదగిన పరిణామము.

అసలు చెప్పాలంటే జీవిత బీమా సంస్థలో వికాసాధికారి అంటే శ్రీ వరిగొండ కాంతారావుగారే ! వారికి వారే సాటి. పూర్తిస్థాయిలో అహర్నిశలు అటు సంస్థ కొరకు ఇటు ఏజెంట్ల శ్రేయోభివృద్ధికి పనిచేసిన శ్రీ వరిగొండ కాంతారావు గారి లాంటి వికాసాధికారి "నభూతో నభవిష్యతి" అనడంలో ఏలాంటి సందేహం లేదు. ఈ విషయంలో నాతోటి సహచర ఏజెంటు మిత్రులు అటు మెదకు కార్యాలయములోనూ, ఇటు వరంగల్లు కార్యాలయములో పనిచేయుచున్నవారు, మరియు కారణాంతరాలవల్ల వివిధ శాఖాకార్యాలయములకు బదిలీ అయ్యి పనిచేయుచున్న వారు కూడా ఏకీభవిస్తారని తలుస్తాను.

1996లో వారు వరంగల్లు శాఖాకార్యాలయానికి బదిలీ అయ్యివెళ్ళే నాటికి నాకు జ్ఞాపకం ఉన్నంత వరకు సుమారు 55 మంది ఏజెంట్లము వారి బృందములో ఉండేవారము.

ఇంతమంది ఏజెంట్లను కలుపుకొని పోతూ అందరినీ సమన్వయపరిచి, సంతృప్తిపరచి, బీమా వ్యాపారాభివృద్ధికి వారు చేసిన కృషి అభినందనీయము. నిజంగా వారు తమ కుటుంబ వ్యవహారమునకై చాలా తక్కువ సమయాన్నే కేటాయించేవారు !

బాధ్యతగల అధికారిగా ఒక సంస్థలో పనిచేయుచున్నప్పుడు వారు సంస్థ బాగోగులు, అభివృద్ధితో పాటు ఏజెంట్ల వ్యక్తిత్వ వికాసము, ఆర్థిక పురోభివృద్ధి మరియు కుటుంబ స్థిరత్వానికి ఎక్కువ ప్రాధాన్యతనిచ్చేవారు. ఒక ప్రభుత్వ ఉద్యోగిగా పనిని పూర్తిగా చేసినా, చేయకపోయినా తనకు నెలకు ఎలాగూ వేతనం వస్తుంది. కాని ఏజెంట్ల పరిస్థితి ఏంటి? వారు నిరంతరం పనిచేస్తూ, తమ వ్యాపారాన్ని పెంచుకొంటేనే వారి కుటుంబాలు బాగుపడతాయి. పదికాలాల పాటు వారు చల్లగా ఉంటారు, ఇదే నిరంతరం వారి మదిలో మెదిలే భావన.

ఏజెంట్లు తమ వ్యాపారాన్ని అభివృద్ధి పరుచుకొనుటలో వారందించిన సహాయ, సహకారాలు మరువలేనివి. తనదైన శైలిలో ప్రతి 15 దినములకు ఒకసారిగాని, లేక నెలరోజులకు ఒకసారి గాని సమావేశములు ఏర్పాటు చేసి సంస్థాపరంగా వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు తెలియచేసేవారు. కొన్ని సందర్భాల్లో 55 ఏజెంట్లలో కొద్దిమంది మాత్రమే సమావేశానికి వచ్చేవారు. అయినా వారు నిరాశ చెందేవారు కాదు. వ్యక్తిగత కారణాల వల్ల వారు రాకపోయివుండవచ్చునని మిగతా ఏజెంట్లకు సర్దిచెప్పి సమావేశాన్ని కొనసాగించేవారు. సమావేశానికి రాని ఏజెంట్లకు అతి నిష్ఠూరంగా, సున్నితంగా ఉత్తరం వ్రాసిన రోజులు కూడా లేకపోలేదు. అయినా ఏజెంట్లు ఎవరూ బాధపడేవారు కాదు.

ఆ రోజుల్లో సాంకేతిక, సమాచార వ్యవస్థ అంతగా అభివృద్ధిలోకి రాలేదు. కేవలం దూరవాణి అందుబాటులో నున్నవారికి సమాచారం వెళ్ళేది. మిగతావారికి తపాలా ఉత్తరం ద్వారా సమాచారం చేరవేస్తూనే, దూరవాణి ఉన్న వారికి కూడా ఉత్తరం ద్వారా సమాచారం వెళ్ళేది. కుటుంబంలోని ఒక వ్యక్తికి గాని, స్నేహితునికిగాని, ఉత్తరం వ్రాయాలంటే ఓపిక నశిస్తున్న ఆ రోజుల్లో మొత్తం 55 మందికి వ్రాతపూర్వకంగా ఉత్తరం ద్వారా సమాచారాన్ని అందచేసిన ఘనత శ్రీ వరిగొండ కాంతారావు గారికే దక్కుతుంది. కొన్ని సందర్భాల్లో తోటి వికాసాధికారులు తాము ఈలాటి పనిచేయలేకపోతున్నామని మరి శ్రీ కాంతారావు గారికి ఎలా సాధ్యమౌతుంది? అని వారిలో వారు చర్చించుకున్న సందర్భాలు లేకపోలేదు. కొందరు వికాసాధికారులు నేరుగా మాతో ప్రస్తావించేవారు.

ఈ సందర్భంగా ఒక ముఖ్య విషయం గుర్తుకు తెచ్చుకోవాలి. ఆ రోజుల్లో ప్రత్యేక సందర్భంగా ఒక సంవత్సరం పాటు, అంటే 365 రోజులు ప్రతి ఏజెంటుకి ప్రతిరోజు ఒక ఉత్తరం వారి నుండి వచ్చేది. పోస్ట్‌మ్యాన్ ఇంటికి వచ్చి 'పోస్ట్!' అని కేక వేస్తే ఖచ్చితంగా అది కాంతారావు గారి ఉత్తరమే అయ్యేది. ఈ సందర్భంగా నా వ్యక్తిగత అనుభవాన్ని గుర్తుకు తెచ్చుకోవాల్సి ఉంటుంది. మా ఇంటికి వచ్చే పోస్ట్‌మ్యాన్ కూడా అడిగేవారు. (వారు ముస్లిం అబ్బాయి అయినా తెలుగు చాలా చక్కగా చదివేవారు) ఏంటి గోపాలరావు గారు, ఈ కాంతారావు గారు ఎవరు? ప్రతినిత్యం మీకు ఉత్తరం వ్రాస్తున్నారు. విషయం ఏంటి? నేను విషయాన్ని తెలియచేస్తే వారి ఆనందానికి అవధుల్లేవు.

మొత్తం 55 మంది ఏజెంట్లకు ప్రతినిత్యం 55 ఉత్తరాలు 365 రోజుల పాటు ఉత్తరాలు వ్రాసి పంపినారంటే అది వారు చేసిన సాహసమే మరి ! ఏ ఇతర వికాసాధికారి కూడా ఇంత పనిచేయలేదు అనుటలో ఏలాంటి సందేహానికి తావులేదు. ఒక్క ఉత్తరం ముక్క వ్రాయాలంటేనే విసుగు అనిపించే మనకి ఈ సంఘటన గుర్తుకు చేసుకొంటే ఒళ్ళంతా పులకరిస్తుంది !. వారు వ్రాసిన ఉత్తరాలు నేటికీ నా వద్ద పదిలపరచుకొన్నాను. సందర్భాన్ని బట్టి, ఒక్కోసారి ఆ ఉత్తరాల్ని పరిశీలిస్తుంటాను. ఇదంతా ఎందుకు? ఇప్పటికీ ప్రతినిత్యమూ ఒకసారి శ్రీ కాంతారావు గారు మన పట్ల అనుసరించిన విధానాన్ని గుర్తుకు తెచ్చుకోండి? ఆ రోజంతా మనకి హుషారుగా అనిపిస్తుంది. !

ఏజెంట్ల వ్యాపారాభివృద్ధికై వారు ముద్రించి వితరణ చేసిన చిన్న పాటి పాకెట్ సైజు దైనందిని పుస్తకాన్ని పరిశీలిస్తే చాలా ఆనందం కలుగుతుంది. ప్రతి పేజీలో పొందుపరచిన సూక్తులు, వివిధ అంశాలు నేటికీ గుర్తుకొస్తుంటాయి. ఈ పుస్తకంలోని విషయాలు కేవలం వ్యాపారాభివృద్ధికే కాకుండా నిత్య జీవితంలో వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో ఉపయోగపడతాయి.

# రెండవ భాగము

# సాహిత్య పర్వము


| | | |
|---|---|---|
| 1. | ప్రస్తావన-తొలి రచన | 58 |
| 2. | ముందుమాటలు (పుస్తకం వారిగ) | 59 |
| 3. | పత్రికా సమీక్షలు, పరిచయ వ్యాసాలు & లేఖలు (పుస్తకం వారిగ) | 105 |
| 4. | గేయశతకములు | 233 |
| 5. | పత్రికా వార్తలు - స్కాన్ చేసినవి | 282 |
| 6. | దృశ్యమాలికలు - ఛాయా చిత్రములు | అనుబంధము |


సాహితీదర్శనంలో భాగంగా..



శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి వారి పూజాగృహ సందర్శనం



కుటుంబం - లేపాక్షి దర్శనం

# ముందుమాటలు

## ఉద్యానం (కవితా సంపుటి)




### ఉద్యానం

కళ యొక్క పరమావధి ఆత్మానందం. ఆనందం సౌందర్యం మీద, సౌందర్యం సత్యం మీద ఆధారపడి ఉన్నాయి. అందుకే – సర్వకళాసారాన్ని సత్యం – శివం– సుందరంగా వింగడించి దర్శించవచ్చు. అంటే ఏది సత్యమో అది శివం; ఏది శివమో అది సుందరం కాగా, అనిత్య, అసత్య లౌకిక జగత్తుకు ఏ నిత్య సత్య శుభసౌందర్యం ఆధారమో ఆ సౌందర్య సాధనా ఫలితమే కళ. E.S. Dallas అనే మహనీయుడు కూడా - "Pleasure is the harmonious and unconscious activity of the soul" అని ఆత్మయొక్క సమరస, అనభిజ్ఞాన పరిశ్రమే ఆహ్లాదమని చెప్పాడు. వస్తు స్థితి కంటె శబ్ద స్థితి గొప్పది, ఆ శబ్ద విద్య కవిత్వం– కాబట్టి కవిత్వం ప్రధానంగా ఆత్మానంద కళ అయ్యింది.

అందమైన అర్థాలు గల అందమైన మాటల్ని అంతకంటె అందంగా కూర్చి చెప్పటమే కవిత్వం. ఈ సౌందర్య సాధన వల్లనే సామాన్యజనులకంటే కవి వేరుగా చూడబడుతున్నాడు. అతని మాటకు గల శక్తి వల్లనే అతనొక విశిష్టమైన వ్యక్తిగా గుర్తింపును పొందుతున్నాడు. కాబట్టి కవి శబ్ద జీవి.

జాతిసంస్కృతికీ, చరిత్రకు శబ్దమే ప్రధానమైన భూమిక. అదే ప్రాణాధారమైన వాహిక.

నిజానికి, సాహిత్యానికి కాలభేదం లేదు. అలాగే దేశ భేదంగానీ, వ్యక్తి భేదం గానీ లేవు. అవి, కేవలం – అధ్యయన సౌలభ్యం కోసం – పఠిత ఏర్పరుచుకునే అడ్డుగీతలు. కవికి సామాజిక స్పృహ కావాలనే నేటి వాదంలో అంత పస లేదు. జగద్ధితం అనేది కవిత్వ ప్రయోజనంగా సర్వ సాహిత్యలోకం అంగీకరించింది. అయితే, ఏ కాలంలో, ఏ కవి ఏ ప్రయోజనం కోసం, ఏ దృష్టితో రాశాడో ఆ దృష్టితో చూడాలి. అప్పుడు ఖేదానికి బదులు మోదమే సిద్ధిస్తుంది. విశ్వకల్యాణ సాధన, శాంతి శోధన ఏనాటి కవికైనా శిరోధార్యాలు, లక్ష్యాలు అని మర్చిపోకూడదు.

పరిణామ శీలమైన ఈ ప్రపంచంలో మార్పు అనేది కూడా బలీయమైన ఒక విధి. ఒక అవగాహన. ఆధ్యాత్మిక వ్యవస్థకు మార్పులేదు. కానీ ఆధి భౌతిక వ్యవస్థకు మార్పు అనివార్యం. ఇది జీవితానికీ, సంఘానికీ, రాజకీయ, ఆర్థిక, న్యాయాది రంగాలకు సంబంధించి ఉంటుంది. దుర్బలత్వం మీద బలం ఎప్పుడూ ఆధిపత్యం వహిస్తూనే ఉంటుంది. ఈ ఆధిపత్య నిర్వహణలోని లోపాల్ని, హింసద్వారానో, అహింస ద్వారానో కాలం సరిచేస్తూ ఉంటుంది. జాతి జీవనం, జీవనదిలా సాగిపోతూనే ఉంటుంది. అది మార్పు ఇచ్చే తీర్పు !

కవిత్వం – ధర్మ గుణ పక్షపాతి, నైతిక సార్వభౌమాధికారి! ఒక శాంతి వాహిని!

కవిత్వం – గతం మీద కాలూని, భవిష్యత్తుని చూస్తూ – వర్తమాన ఫలాన్ని అందించే శబ్దామృతమోహిని!

కవిత్వం – సమస్యలనే విషజ్వాలల తర్వాత ఉదయించే పరిష్కారామృత కలశం!

మనశ్శాంతికి, ఆత్మశాంతికి కవిత్వం కావాలి లేదా, ఒక మంచి మాట కావాలి. తేనె మాట లేని, సాహిత్యాభిరుచి లేని మానవజంతువులు – పుట్టలోని చెదలు!

# దోస్తాన (కథా సంపుటి)



## శ్రీ లేఖ

శ్రీలేఖ సాహితి గత 25 సంవత్సరాలుగా కృషి చేస్తూ, సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలతో పాటుగా సంస్థ సభ్యుల పుస్తకాలను ప్రచురణలుగా తెస్తున్నది. ఆ భాగంలోనే ఈ పుస్తకము కూడా. శ్రీ వరిగొండ కాంతారావు గారు కవి, కథకుడు. ఆయన కథలు చతుర, జాగృతి మొదలగు పత్రికలలో అచ్చు అయినవి. వారి కథలలో ప్రధానముగా వ్యంగ్యము చోటు చేసుకొంటుంది. సెటైర్ ప్రక్రియను పోషించడము అంటే కత్తిమీద సాము లాంటిది. ఆ ప్రక్రియను దిగ్విజయంగా ఆకళింపు చేసుకొన్నవారు కాంతారావు గారు.

ఈ కథల సంపుటిని శ్రీలేఖ సాహితి ప్రచురణగా వెలువరించి, సంస్థ పురోగమనములో నూతన భాగస్వామ్యం అందించినందుకు అభినందనలు.

మరెందరో మహానుభావులు, అందరికీ వందనాలు.

**పల్లె సీను** | **డా. టి. శ్రీరంగస్వామి**
ఉపాధ్యక్షులు | అధ్యక్షులు
హనుమకొండ | ఫిబ్రవరి, 2002

## చలనం కలిగించే కథలు

వ్యక్తివేరు, సమాజం వేరు – ఇది కొందరి మతం! వ్యక్తి సమాజం, రెండూ ఒకే నాణేనికి రెండు పార్శ్వాలు – ఇది మరికొందరి అభిమతం!

మొదటి మత పెద్దలు – సమాజం భ్రష్టుపట్టి పోయింది. వ్యవస్థ మారాలి. అప్పుడే వ్యక్తి మారతాడు అంటారు.

రెండవ అభిమతస్తులు – సమాజం, వ్యవస్థ వ్యక్తుల కూడలీ, కూటమీ. కనుక వ్యక్తి మారితే వ్యవస్థ మారుతుంది అంటారు.

వ్యక్తినీ, వ్యవస్థనీ కూడా ఉత్తమ మానవీయ లక్ష్యాలవైపు నడిపించడం సాహిత్యం నిర్వహించవలసిన బాధ్యతాయుతమైన కర్తవ్యం. ఈ కర్తవ్యాన్ని చిత్తశుద్ధితో నిర్వహిస్తున్న సాహిత్య ప్రక్రియ తెలుగు కథ. తెలుగు కథకులు ఆది నుంచీ బాధ్యత నెఱిగిన సాహిత్యకారులు.

వ్యవస్థలోని రొదనీ, సొదనీ – వ్యక్తిపరంగా అతని అనుభవపరంగా, అనుభూతిపరంగా–చిత్రీకరించి, ఉత్తమమైన కథల్ని అందిస్తూ సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తూ వున్నారు తెలుగు కథకులు.

ఈ రొదలూ, సొదలూ– విశ్లేషణకి అంత తేలిగ్గా లొంగవు. కథల్లో, నేపథ్యంలో ధ్వనిస్తాయి. పాత్రల ద్వారా మాట్లాడతాయి. సంఘటనల మూలంగా ఛాయామాత్రంగా పాఠకులకు దగ్గఔతాయి.

# ఝరి (కవితా సంపుటి)



## వెలుగును నింపే వాక్యమై...

నిబద్ధతగల కవి, నిజమైన కవి, నిఖార్సైన కవి మాత్రమే సాహిత్యం పట్ల, జనసామాన్యం పట్ల పూర్తి విశ్వాసంతో తన రచన కొనసాగిస్తాడు. ఈ నమ్మకాన్ని వమ్ముచేయని అరుదైన కవి వరిగొండ కాంతారావు. మొన్న 'ఉద్యానం' ఐ విస్తృతించాడు. ఇవ్వాళ 'ఝరి'యై ఒక ప్రవాహవేగంతో దూసుకెళుతున్నాడు. **"అనాదిలో ఆదినీ / అనంతంలో అంతాన్నీ అన్వేషిస్తున్న వాణ్ని నేను కవిని"** అని తలెత్తుకు వేళ్మానుతున్నాడు.

మంచి కవిత్వానికి మంచి రూపం తోడైతే అది మరింత ప్రయోజనకారి అవుతుందని కాంతారావు కవిత్వానికి భాష్యం చెప్పాల్సిన అవసరం లేదు. వస్తువుకు కావల్సిన స్పష్టమైన లయ ఈయన సొంతం. ఒక ఆర్ద్రతనిండిన ప్రేమ, ఒక వివేచనగల ఆవేశం, అవగాహన గల సామాజిక దృక్పథం ఖచ్చితమైన ఆశావాదం, రోజురోజుకు పెరుగుతున్న సామ్రాజ్యవాదం ఈ పుస్తకం నిండా వున్నాయి. **"సూర్యుణ్ణి డైనమైటెట్టి / పేల్చేశారెవరో / ఖండ ఖండాలుగా/.../ మళ్ళీ ఉదయానికి / శరీర శకలాల్ని / ఒకటొకటిగా అతికించుకు/ ప్రాగ్దేవి ప్రసవాన/ బాలార్కుడైనాడు/ వాడు అమరుడే కాదు అఖండుడు కూడా!"** (అఖండుడు) అని కవి ఒక భరోసాతో చెప్పిన ఆత్మవిశ్వాసం గొప్పది.

**"ఏ గదిపోయినా ఇల్లు అసమగ్రమే/ ఏ ప్రాణం పోయినా శోకం అమ్మదే / అయినా సర్దుకుపోయేతరం అంతరించింది/ తన్నుకు చచ్చే తరం అవతరించింది".** ఇప్పుడందరూ 'మా ఇల్లు' చీల్చి చెడుపేదో చేస్తున్నారనే ఆవేదనా స్వరం ఈయనది.

**"ఒకరు ఒత్తి ఒకరు చమురు / ఇరువురు కలిసిన జ్యోతి / వెలుగెవరిది అన్న ప్రశ్న / దివ్వెనార్పు పథకమే".** ఇప్పుడిక స్త్రీ పురుషులిరువురిలో ఎవరు గొప్ప అని చర్చించుట మాని ఇరువురూ కలిసిపోవాలని సూచిస్తారు. "పట్టభద్రుడనైనా పొట్ట భద్రతలేని" విశ్వవిద్యాలయాలలో ప్రవేశిస్తే చాలు అక్కడి సమస్త రాజకీయ విన్యాసాలనూ గొప్ప సెటైర్‌తో చెప్పిన కవిత హృదయాన్ని ఆకట్టుకుంటుంది. **"జిహాదులకు జయమంటే / సెక్యూలర్ అంటారట/భరతమాత జయమంటే / మతోన్మాది అంటారిట"** అని ఆవేదన చెందుతాడు. **"బందిపోటు, ఉగ్రవాది, తీవ్రవాది, మతోన్మాది, నాయకుడూ, పోలీసూ.."** అందరూ మోసము చేసేవారే ఒక్క నా దేశపు జవాను తప్ప... అంటున్న నమ్మకాన్ని కాదనగల వాళ్ళున్నారా?

ఇంకా ఎన్నని వ్రాసేది- **"కళ్ళు తడిస్తే పల్లె, వొళ్ళు మెరిస్తే పట్నం"** అని బేరీజు వేస్తాడు. **"తలపందుల దీపం / తలాపుకచ్చినంక / సానుపుజెయ్యని వాకిలి / పలంగు పీటయితది / సుక్కలు నిండిన ఆకాశం / మచ్చుర్దానయితది"** అని పలికిన 'సావుదినం' ఇంకా 'నమస్తే' ల తెలంగాణ పలుకుబడిలో రాసిన కవితల సమాహారంలో సాగిన 'ఝరి' సాహితీ సమితి, ప్రచురణగా ప్రకటిస్తున్న వరిగొండ కాంతారావును అభినందిస్తున్నాం.



# సంద్రం (కవితా సంపుటి)

## కవిత్వం - సామాజిక బాధ్యత

మనిషి గురించి మాట్లాడ్తూ – ఒక సామాజిక అంశంగా ఇవ్వాళ కవిత్వీకరిస్తున్న కొద్దిమందిలో వరిగొండ కాంతారావు ఒకరని చెప్పడం ఒక సాధారణ విషయం. క్రియాశీలుడైన కవి తన చుట్టూవున్న వాతావరణాన్ని కవిత్వంగా మలచుకొంటూ ముందుకు సాగుతాడు. వొర్తి మెదళ్ళలో సారాన్ని నింపి పచ్చదనాన్ని పండించే కృషీవలుడై ఆ దోవలోకి మరికొంతమందిని ఆహ్వానిస్తాడు. అలాంటి కవి వరిగొండ కాంతారావు 'సంద్రం' ఒక దృశ్యం.

ఇంత దాకా 'ఉద్యానం' 'ఝరి' కవితా సంపుటుల ద్వారా, 'దోస్తాన' కథా సంపుటి ద్వారా సాహితీ ప్రపంచంలోకి అడుగు పెట్టిన మా సంస్థ క్రియాశీల సభ్యుడు వరిగొండ కాంతారావు 'సంద్రం' కవితా సంకలనం పరిమితులకు కొన్ని కొత్త ఆలోచనా తీరాలు చూపుతుందని ఆశిస్తున్నాము.

**'మీరింక బువ్వను మీల్సు జేసినంక'** ఈ కవిత్వాన్ని చదవండి. లేకుంటె మీకు మరింత ఆకలైతది.

నిత్యజీవితంలో చూస్తున్న అనేక సంఘటనలు స్పందన వున్న మనిషిని కదిలించి తీరుతాయి. ఐతే ఆ స్పందన ఏ కోణంలో సాగింది, సమాజం హితాన్ని కాంక్షించే ఒక 'పాజిటివ్' దృక్పథం వుందా? లేదా అన్న అంశంపై ఆ కవిత్వాన్ని బేరీజు వేస్తాము. ఆ కవి గురించి మాట్లాడుకుంటాము. ఆ దిశలో కాంతారావుకు చాలా విషయాలపట్ల ఒక పాజిటివ్ ధోరణి వుంది.

**'పచ్చదనమె పరిశుభ్రత/ అనుచు గడ్డి పరచినారు/ గడ్డికి నీరును పోయగ/ పనివాళ్ళను బెట్టినారు'** అంటూ ఇవ్వాల్టి పరిశుభ్రతా కార్యక్రమాల తీరుతెన్నులపై చురకలు అంటిస్తూనే **'వెనుకటివాండ్లకు తెలియక/ ధాన్యమునే తినెడివారు/ మానవులంతా ఇకపై / నేరుగ పచ్చిక తినెదరు'** అని అవార్డులు పొందిన శాస్త్రజ్ఞుడి గుడ్డి విధానాన్ని 'పచ్చదనం' కవిత ఎరుకపరుస్తుంది.

తెలంగాణ భాష, సంస్కృతి ఇవాళ ఒక సామాజిక సందర్భం. సామాజిక స్పృహ వున్న ఎవరైనా తెలంగాణా బతుకుచిత్రం గురించి మాట్లాడకుండా వుండలేని అనివార్య పరిస్థితి ఏర్పడింది. ఇక్కడి కరువు, ఇక్కడి నీటి వనరులు, ఇక్కడి నిరక్షరాస్యత, ఇక్కడి ఆర్థిక స్థితి, ఇక్కడి ఉద్యోగాలూ ఒకటేమిటి సవాలక్ష సంఘటనలను విభేదించిన సృజనశీలురు చాలా అరుదుగా కన్పిస్తారు. ఈ వాతావరణంలోంచి అచ్చమైన తెలంగాణా పలుకుబడులతో గొంతు సవరించుకుంటున్న వరిగొండ కాంతారావు 'ఫికరు' మంచి కవిత.

**"నేను కత్తిదీసిన / వాడుబాకు దీసిండు.. నేనింక చాన్నెదీసిన/ వాడంతకు చాన్నె దీసిండు"**... ఇట్లాంటప్పుడే **'జూలు కోరలు గోల్లియ్యరాదె/ ఫికరు బాసిపోత'**దంటడు.

'బందిల్దొడ్డి' కవితలో దేవుని కోల్యాగలు చేసే పనికి జుల్మానుండదు. **'అవి బయటున్న లోపటున్న మేత ఖరారె'.. 'ఏది మేసిన ఎవలది మేసిన అడిగె పెద్దమనిషి లేడు'..** వీటికి ఎవరి కష్టం తెలువదు. **'కోల్యాగలకెద్దు గొట్టిస్తెగని, తొవ్వకచ్చెటట్టు లెవ్వు'** అని ఫైసలజేసి పరోక్షంగా మానవమృగాలను చూపెడతాడు. వ్యంగ్యంగా ఈసడిస్తాడు.

# గగనం (కవితా సంపుటి)



## వర్షిస్తున్న గగనం

వరిగొండ కాంతారావు విలక్షణమైన కవి. సామాజిక సందర్భాలను గుర్తించిన కవి. చెప్పదలుచుకున్న విషయాన్ని సూటిగానే చెప్తాడు. కవిగా కమిట్‌మెంటు వున్నవాడు కాబట్టి అన్ని నిబద్ధతలలోని లోపాలను ఎండగట్టే ప్రయత్నం చేస్తాడు. వ్యక్తిగా స్పందించిన అనేకానేక సంఘటనలను కవిత్వమై రికార్డు చేస్తున్నాడు. అన్ని నిజాలను ప్రేమిస్తూ... ద్వేషిస్తూ..... ఆలోచించమంటాడు. మారుతున్న విలువల్లో సైద్ధాంతిక వలువలూడుతున్న దృశ్యాలను జాగ్రత్తగానే గమనిస్తున్నాడు. అందరినీ కన్విన్స్ చేస్తూ.... తన దైన ప్రత్యేకమైన శైలితో ముందుకు సాగుతున్నాడు. ఈ నేలనూ, ఈ భూమినీ బలంగా విశ్వసించిన కవి కాంతారావు.

ఊహల 'ఉద్యానం' లో విహరించి 'ఝరి' దాటి 'సంద్రం'తో 'దోస్తానా' చేసి 'గగనం' అంత విస్తృతమై కవిత్వమై వర్షిస్తున్న వరిగొండ కవితకు భావుకతతో కూడిన లయ ప్రాణం. గతం లోపాలను వర్తమానంలో సవరించి జీవిస్తూ భవిష్యత్ ఆశయాల ఆనంద సోపానాన్ని నిర్మించాలని ఆశిస్తున్నాడు. ఏదో ఒక కోణం వద్ద నిలబడి కవిత్వీకరించక అన్ని కోణాలనూ తడుముతూ అందర్లోకి తన భావజాలాన్ని నింపుతూ సమన్వయవాదిగా కన్పిస్తున్నాడు. గగనమంతా కవితా బీజాలను తన శక్తిమేర చల్లుతున్నాడు.

***దేవుని మేము/నమ్మితీరెదము/అని అచ్చొత్తిన డాలరు నోట్లను/***

***ఆస్తిక నాస్తిక వాదులందరూ / చచ్చినట్లుగా నమ్మితీరెదరు.***

ఎవరి విశ్వాసం వారిదైనా డాలరు నోటు వద్ద చచ్చినట్లు ఒక్కటవ్వడం... ఇవ్వాల్టి ప్రపంచం రీతిరివాజుగా మారిందని అనేక నమ్మకాలను విశ్వసించని పరిస్థితిని వివరిస్తాడు.

కుటుంబ సమస్యలతో కూడిన అనేక కవితలను జనసామాన్యంచేసి నిశ్శబ్దంగా ఒక పరిష్కార మార్గాన్ని చూపుతాడు.

'అనివార్యం'గా –

***తల్లీకూతురు పాత్రలుకూడా / తమవని ఎరుగని అత్తాకోడలు/***
***రాజీనెరుగని యుద్ధము జేసిరి / పిల్లల మనమున విషమునువిత్తిరి.***

అంటూనే

***......ముసలిదానిపై ప్రేమలు పొర్లగ / ఘొల్లున ఏడ్చిరి యుద్ధ సైనికులు...*** అనడం బతికున్నప్పుడు నిర్లక్ష్యం చేసి చావగానే ఏడ్పులు పెడబొబ్బల ప్రేమ ప్రకటనల తీరును తీవ్రంగా నిరసిస్తాడు. మరణాన్ని సైతం రణంగా మార్చిన కుటుంబ సభ్యులందరూ యుద్ధ సైనికుల్లా మారడం సహేతుకం కాదనే ధ్వని. ***ఆడదాని అంగాలను/పోస్టర్లుగ ముద్రింపగ/ బాగ చదువుకొన్నవారు/అశ్లీలాన్నార్థందురు/రెచ్చగొట్టగలుగు దృశ్య/ మొక్కటె అశ్లీలమ్మట/రెచ్చిపోను చేవలేని/దద్దమ్మల తీర్పు ఇది....***

అని ఓ చిన్ని బూతుకథ చెప్తాడు. కళలకు భాష్యం చెప్పెడి కూళల గూర్చి మాట్లాడ్తాడు.




# అనలానిలము (కవితా సంపుటి)

## అభినందన

ఈ కవితా సంపుటి పేరు 'అనలానిలము' అంటే శబ్దార్థపరంగా నిప్పుగాడుపు. శీర్షిక కొత్తగా ఉంది.

ఈ సంపుటిలోని కవితల్లో వస్తువు వైవిధ్యభరితంగా ఉంది. ఉపదేశం, చమత్కారం, అధిక్షేపం లాంటి భావాలను పొదుగుకొన్న కవితలు ఈ సంపుటినిండా ఉన్నాయి.

ఆశయ నిబద్ధతతో, అభివ్యక్తి స్పష్టతతో రూపొందించిన కవితలను ఈ సంపుటి రూపంలో అందిస్తున్న వరిగొండ కాంతారావుగారికి నా అభినందన.

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత

ఆగష్టు 2007 **- డా. సి. నారాయణరెడ్డి**

హైదరాబాదు

## భావానలనాన్ని మోసుకుపోయే అక్షరానిలం

ఏ దేశంలో పుట్టినవారికైనా, తమదేశపు భాషా సంస్కృతుల మీద గౌరవాభిమానాలుండాలి. ఎన్ని వైరుధ్యాలున్నా, మౌలికమైన జీవనవిధానం మీద ప్రేమ ఉంటే, వైరుధ్యాలకు సంస్కృతిని విచ్ఛిన్నం చేసే శక్తి ఉండదు కాని, యితర కారణాలచేత, మరొక సంస్కృతి ఆధిపత్యాన్ని తలకెత్తుకుని, మనని మనమే నిరసించడం కొనసాగిస్తే, మనలో మనం అదృశ్యమై, ఇంకొకళ్ళుగా మారిపోతాం. మారుతుండగా, మారుతుండగా, అంతిమంగా వచ్చే ప్రశ్న 'ఔను, మారిపోతే ఏమయింది? మన భాష పోతే ఏమయింది? మన సంస్కృతి పోతే ఏమయింది?ఇప్పటికే ఈ దేశంలో కొద్దిమంది మనస్సు రంగుమారిపోయిన వాళ్ళకి అంతరంగంలో అదే మాట ధ్వనిస్తూ ఉంటుంది. సార్వభౌమాధికారం, దేశ అస్తిత్వం పోవడమంటే ఒక దేశం ఆత్మహత్య చేసుకుంటున్నట్లే. అయితే, యిది మరొక ఆధిపత్యవాదికి, తన సంస్కృతి ఎట్టి పరిస్థితిల్లోనూ కోల్పోవడం ఇష్టంలేని వాడికి 'బానిస' కావడమే అవుతుంది. మన భాషపోతే ఏమయింది అని మనం అనుకుంటున్నట్లు, వాడు అనుకోడు. తన భాష శాశ్వతంగా ఉండాలి అనుకుంటాడు. వాణ్ణి చూసి మనం నేర్చుకోకుండా, రాజీపడే తత్త్వంలోంచే, మన భాషనీ, సంస్కృతినీ అభిమానించడం దురభిమానంగా, అన్ని సంస్కృతుల్నీ కలుపుకోవాలంటూ వాడి సంస్కృతినే అనుసరించే మార్గంలోకి నెమ్మదిగా జారిపోవడంగా పరిణమిస్తుంది. ఈ దేశాన్ని ప్రేమించే వారు సహజంగానే తమ సార్వభౌమాధికారాన్నీ, సంస్కృతినీ వదులుకోవడానికి ఇష్టపడరు. ఈ దేశంలో సాంస్కృతిక భిన్నత్వం ఉందనుకున్నా, అందరి సంస్కృతినీ మింగేసే డేగలు వాల్తున్నప్పుడు, తప్పని సరిగా వాటిని వ్యతిరేకించడమే దేశాభిమానం ఔతుంది. ఇలాంటి దేశాభిమానం ఈనాటి ఆలోచనాపరులైన కవులందరికీ ఉంది. తమ తమ అభిప్రాయాల్లో సిద్ధాంతాల్లో భేదాలున్నా, మనం మనంగానే ఉండాలన్న భావన తీవ్రంగా ఉంది. అలా ఉన్న కవుల్లో వరిగొండ కాంతారావు ఒకరు. ఆయన రాసిన

# ప్రణవం (కవితా సంపుటి)



## దివ్యాశీస్సులు

ప్రణవము అనగా ఓంకారము. ప్రకృష్టమైన నిత్యనూతనమైన సృష్టి ప్రణవం నుండే వచ్చినది. ప్ర+నవ అని ప్రణవమునకు ఒక వ్యాఖ్యానము. ఇది నాద బిందు కళా స్వరూపము. సృష్టికి మూలము శబ్దము. మానవుని లౌకిక వ్యాపారమునకు కూడా శబ్దమే సాధనము. అది పరా పశ్యంతి మధ్యమ వైఖరి రూపములతో ఆవిష్కృతము.

వరిగొండ కాంతారావు గారు నాకు చిరకాల మిత్రులు. నిరంతర సాహితీ కృషీవలుడు. వివిధ పత్రికలలో వారి సారస్వత వ్యాసములు చదివి తెలుగు పాఠకులు ఆనందించిన విషయము వేరే చెప్పనక్కరలేదు. వారి రచనలలో పరిణామము, పరిణాహము రెండూ క్రమంగా ఇంతింతై వటుడింతై అన్నట్లు చోటు చేసికొన్నాయి.

నిన్న ఆషాఢ పూర్ణిమనాడు నా వద్దకు వచ్చి తన ప్రణవం కవితా సంకలనం నుండి కొన్ని ఖండికలు వినిపించారు. ఆద్యంతమూ కాకున్నా ఆది, అంతము విన్నాను. బ్రహ్మాండమును పిండాండములో దర్శించిన భావము మొదటి కవిత. ఈశ్వర స్వప్న సాక్షాత్కారము చివరి కవిత.

ఇతడు ప్రతిభావంతుడు. ఛందము, స్వచ్ఛందము నల్లేరు మీది బండినడక. 'కవి ప్రతిభలోన కావ్యగత శతాంశముల యందు తొంబదిపాళ్ళు నవ కథా దృతిని మించి ఉండు'నని విశ్వనాథ ఉవాచ. అనగా రసము వేయిరెట్లు గొప్పది.

కాంతారావు వ్యక్తిత్వమూ, కవిత్వమూ రెండూ రసవంతమే. తినబోతూ రుచులడిగినట్లు ఈ మధుర భక్ష్యమును ఆస్వాదించే సహృదయులకు ముందుగా నా వందిమాగధ వైతాళిక కైవారములు అవసరము లేదు.

కాంతారావు గారి కలమునకు పరమేశ్వరుడు బలమునిచ్చి బ్రోచుగాక!

ఇతి శమ్!

నందన ఆషాఢ బహుళ పాడ్యమి
దివి: 4.7.2012

**– ప్రొఫెసర్ ముదిగొండ శివప్రసాద్**
చారిత్రక నవలా చక్రవర్తి, హైదరాబాదు

## మట్టికొండ

రెండున్నర దశాబ్దాలుగా తెలుగు కవిత్వాన్ని తన రచనల ద్వారా సుసంపన్నం చేస్తున్న కవిసత్తముడు శ్రీ వరిగొండ కాంతారావు. వచనకవిత్వం రాసినా, గేయంలో శతకాలు రాసినా, కథలు రాసినా, హిందీ అనువాదం చేసినా వెరసి డజన్ పుస్తకాలు ప్రచురించినా రవ్వంత గర్వం లేని వినయశీలి శ్రీ వరిగొండ.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Rachanodyogamu**

* * *